# అలవాటైన కోతి

—తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

నీకిన్నాళ్ళూ ఉత్తరం రాయకపోవడమే మంచిదైందనుకుంటున్నాను. సరే ముందు పాపకి అయిదో నెల వచ్చేవరకూ రావని రాసింది సుగుణ. తల్లీ, పిల్లా ఆరోగ్యంగానే వున్నారు. వచ్చే నెలలో ఓసారి విజయవాడ వెళ్ళిచూసొస్తాను. పక్కనే ఏడిశావుగా — నీ దగ్గరికీ వస్తాలే. రేపు ఆదివారం తీరిక చేసుకుని సుగుణని చూసిరా. అయిందా.

ఇవాళ ఉత్తరం రాయక తప్పదు నాకు. నీకే రాయగలను. రంపచోడవరం తెలుసా? అంటే అడవి అనుకున్నావన్న మాట. నాకు బాగా అలవాటే. దిగువ నుంచి రోడ్డు రిబ్బను మారేడుమల్లి అడవుల దగ్గరికి తీసుకు వెడుతుంది. తరచుగా అడవిలోకి వెడుతుంటాం. కాలం, దూరం, స్థలం అన్నీ దిగువనే ఒదిలెయ్యడమే. అడవి పచ్చటి గర్భంలో కదలాడే పిండాన్ని. మెల్లిగా రాత్రి అడవి చీకటి రోడ్డు మీంచి మెత్తగా ప్రవహించి ఊళ్ళోకి వస్తుంది.

ఇక్కడి ఉద్యోగులందరూ శిక్షాకాలం ఎప్పుడు పూర్తవుతుందా అని చూస్తుంటారు. అడవి పచ్చటి రహస్యంలోకి వాళ్ళు వెళ్ళరు. పగలంతా తీర్చదిద్దినట్టున్న కొండలకి రాత్రి ప్రాణం లేచొస్తుంది. ఒక్కోసారి కొండల మీంచి ఒత్తుగా జారే మబ్బుల్ని చూస్తే కొండలకి జలుబు చేసినట్టుంటుంది. చలికాలంలో, నీలపు దుప్పట్లు కప్పుకుని గడ్డ కట్టుకుపోయుంటాయి కొండలు. ఒక్కోసారి, ఉదయమే ఏ కొండ మధ్య నుంచో సన్నటి పొగ కనిపిస్తుంది. చలికి ముడుచుకు పోయి, చుట్ట కాలుస్తున్న వృద్ధ ఆటవికుళ్ళా వుంటుంది కొండ. పచ్చటి కొండల మధ్య మబ్బులు పారేసుకున్న వెండి జరీదారంలా వుంటుంది సీలేరు.

ఆ రోజు సాయంకాలం ఆఫీసు నుంచి ఇంటికొచ్చే సరికి కొంచెం ఆలస్యమైంది. టీ నీళ్ళు పెట్టి స్నానానికి వెళ్ళేను. పెరట్లో రెండు బొప్పాయి చెట్లూ బోడిగా వున్నాయి. ఆకులూ (తాంబూలం) తిని ఒదిలేసిన బొప్పాయి కాయలూ, పెరడంతా బీభత్సంగా వుంది. మధ్యాహ్నం కోతుల గుంపు సవారీ చేసి వెళ్ళుం టుంది.

టీ తాగుతూ వరండాలో కూచున్నాను. రోడ్డు మీద జన సంచారం తగ్గింది. అడవి చీకటి వేరు. పట్నాల్లో లైట్లూ, కార్లూ, ఇళ్ళూ సాయంకాలం నుంచీ చీకటి కోసం చూస్తుంటాయి. పసిగడతాయి. కొండలు విసిరిన వల్లె వలలు అడవి చీకట్లు, ఒక్కసారి చటుక్కున నిన్ను చీకటి ముంచెత్తుతుంది. సిగరెట్టు చీకట్లోకి విసిరి వరండాలో లైటు వేద్దామని లేచాను. లోపల ఏదో చప్పుడైంది. లైటు వేసి లోపలికి వెళ్ళేను. వంటింట్లో ఏమీ లేదుగానీ టీ గిన్నె కింద పడుంది. కిటికీ తీసి వుంది. ఊచల మధ్య ఖాళీ ఎక్కువ. ఏ పిల్లో దూకి వుంటుంది. పడగ్గదిలో చూశాను. 'శూశూ' మని నాలుగు సార్లు అరిచినా ప్రయోజనం లేకపోయింది. మళ్ళీ కుర్చీలో వాలి మరో సిగరెట్టు తీశాను. ఈసారి స్పష్టంగా ముందు గదిలోంచి శబ్దం వినబడింది. ఒళ్ళు మండి లేచి ఒక్క అంగలో గదిలోకొచ్చేను. నా పుస్తకాల బల్ల మీంచి నాలుగు ఫైళ్ళు కింద పడున్నాయి. అయితే నన్ను గది మధ్యలో నిలబెట్టింది ఫైళ్ళు కాదు. టేబిలు లైటు పక్కన మిగిలిన రెండు ఫైళ్ళ మీద గొంతుక్కూచుని నా వేపు భయంగా చూస్తోంది కోతిపిల్ల. నాకు తేరుకోడానికి కొంతకాలం పట్టింది. లైటు వెలుగులో గోధుమ రంగు కళ్ళతో నన్ను పరిశీలనగా చూస్తోంది. ఓ క్షణం ఆగి పొట్ట గీరుకుని అటూ ఇటూ చూసింది. గదిలోంచి ఎలా పారిపోవాలో తెలీకేమో. నేనలా చూస్తూ వుండి పోయాను. చిన్న పిల్ల. మందలోంచి ఎలా వేరుపడిందో అర్థం కాలేదు. సామాన్యంగా అలా జరగదు. అదింకా ఆశ్చర్యం లోంచి తేరుకోలేదు. నేనే ముందు తేరుకుని వంటింటి తలుపు బార్లా తీసొచ్చి పడగ్గదిలో కర్ర తీసుకొచ్చి నేల మీద కొట్టేను. నేను వెళ్ళడం గమనించిందది. కర్ర శబ్దం అవడంతో ఓసారి నా వేపు చూసి ఒక్క గెంతులో వంటింట్లోకి వెళ్ళిపోయింది. కర్రతో శబ్దం చేస్తూ, అరుస్తూ దాని వెనకబడ్డాను. గుమ్మం బయట నుంచుని లోపలికి చూస్తోంది. నన్ను చూసి చీకట్లోకి పారిపోయింది. కిటికీ తలుపులు జాగ్రత్తగా వేసి కూచున్నాను. కాసేపటికి కోతి పిల్ల సంచలనం మర్చిపోయాను. రాత్రి నిద్రలోకి జారే ముందు మాత్రం చిన్నముండ చీకట్లో ఎక్కడికిపోయిందో అను కున్నాను.

దిగువ అడవి జల్లెడలోంచి ఉదయం వచ్చింది. కాఫీ కలుపుకుని ఓ చేత్తో కప్పు, మరో చేత్తో పేపరూ, వెనక్కి తిరిగేను. ఉదయపు ఎండలో చలికాగుతూ తలుపుకు వీపు నానించి నా వేపు చూస్తూ కూచుంది కోతిపిల్ల. కాసేపు బొప్పాయి చెట్లనీ, కాఫీ గిన్నెనీ, నన్నూ పరిచితంగా చూస్తోంది. స్టూలు మీద కూచుని దాని వేపే చూశాను కాసేపు. ఎండలో దాని ఒళ్ళు మెరుస్తోంది. పట్టు బంతిలా వుందది. లేత ముఖం. గోధుమ రంగు కళ్ళు నవ్వి నవ్వుతున్నాయి. కళ్ళ నిండా ఆకతాయి తనం. తల తిప్పి వంటిల్లు పరిశీలించింది. ముద్దొస్తోంది. తీసుకుని ఒళ్ళో కూచోపెట్టుకోవాలనిపించింది. నా కళ్ళలో స్నేహం పసిగట్టింది. రెండడుగులు లోపలికి వేసి మళ్ళీ సభ్యత కాదనుకుని వెళ్ళి తలుపు దగ్గర కూచుంది. లేచి వైరు బుట్ట లోంచి పెద్ద టొమాటో, ఓ బంగాళాదుంపా తెచ్చి ముందు పెట్టాను. తలెత్తి నా వేపు ఓసారి చూసి టమాటో చేతిలోకి తీసుకుంది. నేను నవ్వేను. నేను కాఫీ తాగుతూండగా అది ఫలహారం ముగించింది. కాఫీ కప్పు గట్టు మీద పెట్టి చిటిక వేసి రమ్మని చెయ్యి జాపేను. కోతిపిల్ల సందేహిస్తూ బొప్పాయి చెట్టు వేపోసారి చూసి, నన్నే నమ్ముకుని మెల్లిగా కాళ్ళ దగ్గర చేరింది. రెండు పాదాల మధ్య మెత్తగా వెచ్చగా ఇమిడిపోయింది. ఒంగి దాని బుజ్జి చెవులు నిమిరేను. లేతగా చిన్న ఆకుల్లా వున్నాయి. ఓ కాల్తో నా చెయ్యి పట్టుకుంది. ఆ ఉదయపు ఎండ వెలుగులో మేం ఇద్దరమే వున్నాం. ఓసారి నా కళ్ళలోకి చూసిందది. చిన్ని నోరు తెరిచి ఆవలించి వంటిల్లంతా (ఎంతలే) తిరి గొచ్చింది. తల నిమిరేను. దగ్గరిగా చూస్తే తేనె కళ్ళు.

ఈసారి తలుపులన్నీ వేసి ఆఫీసుకెళ్ళిపోయాను. మా పి.ఓ.గారు సెలవులో వున్నారు. పన్నెండవుతూండగా ఏదో ఫైలు తీసుకుని రత్నం వచ్చింది. ఆమె మా ఆఫీసులోనే పని చేస్తోంది. సంతకాలు పెట్టి ఇచ్చేశాను. ఆమె నుంచునే వుంది.

"నా సెలవు సార్."


క్రితంనెలలో రత్నం మెడికల్ లీవు పెట్టింది. సెలవు చిన్న గొడవలో పడింది.

"పి.ఓ. గార్ని రానీ."

"మీరే సాయం చెయ్యాలి."

అది కష్టమని ఆమెకీ తెలుసు. సమాధానంగా నవ్వేను. రత్నం వెళ్ళిపోయింది.

సాయంకాలం ఇంటికెళ్ళి వరండాలో కూచోగానే కోతిపిల్ల జ్ఞాపకం వచ్చింది. వెలిగించబోయిన సిగరెట్టు నోట్లోంచి జారిపోయింది. వంటింట్లోంచి భళ్ళున శబ్దం. వెళ్ళి చూస్తే సాంగిన్నె కింద పడుంది. తలుపు బార్లా తీసుంది. స్నానం చేసొచ్చి తలుపు వెయ్యడం మర్చిపోయాను. అటక మీద కూచుని ఒంగి నా వేపు ప్రశాంతంగా చూస్తోంది కోతి పిల్ల. ఒక్క అంగలో గదిలోకెళ్ళి కర్ర తీసుకొచ్చేను. కానీ అది నన్ను బాగా అర్థం చేసుకుంది. అవలీలగా గెంతి ముందుగదిలోకి




పారిపోయింది. ఈసారి కిచకిచ నవ్వుతూ టేబిలు మీద పుస్తకాలు కింద పడేసింది. ఒక్క గెంతులో దోమతెర మీద పడింది. నాకేం చెయ్యాలో తోచలేదు. ఉయ్యాల్లా అందులో పడి ఊగుతూ గెంతలేక అవస్థపడుతూ కిచకిచమని గోల. క్షణంలో ఇల్లు సర్కస్ అయిపోయింది. ఒక్క అయిదు నిమిషాలలో పది సంవత్సరాల స్తబ్దత చెల్లాచెదురైపోయింది. దాని గొడవ చూసి దగ్గరికెళ్తే కరుస్తుందేమోనని భయం వేసింది. పుస్తకాలు టేబిలు మీద పెట్టి వెనక్కి తిరిగేను. ఉయ్యాల ఆగిపోయింది. తెల్లటి దోమ తెర పందిరి అంచున చిన్ని గోధుమ రంగు తల మాత్రం కనిపిస్తోంది. నా వేపు నిష్ఠూరంగా చూస్తోందది. ఓ క్షణం చూసి దింపమన్నట్టు ఊగిందో సారి. నా కోపం, చికాకూ పటాపంచలైపోయాయి. చెయ్యి చాపి ముందని కిందికి దించాను. నా కాళ్ళ దగ్గర కూచుని నా వేపోసారిచూసి వెళ్ళి టేబిలు మీద కూచుంది. ఐ.టి.డి.పి. వారి ఫైళ్ళు దానికెందుకో ఇష్టం. ఎందుకో తెలీదు. (వాటని తడుపుతుందని నా భయం.)

తీరిగ్గా గోడ కానుకుని తల తిప్పుతూ ఇల్లంతా పరిశీలిస్తోందది. ఎందుకో దాన్ని బయటికి గెంటాలనే ఆలోచన పోయింది.. నేను టేబిలు దగ్గరికి జరిగి మెల్లిగా చెయ్యి జాపి స్విచ్ నొక్కి టేబిలు లైటు వెలిగించేను. ఒక్కసారి వెలుగు పడగానే దాని ఆశ్చర్యం, భయం చూడాలి. వెలుగులో దాని కళ్ళు మెరిశాయి. పుస్తకాల దొంతరలోకి చిన్న బంతిలా దూరిపోయి, బల్బువేపు చూస్తూ మెల్లిగా కాలెత్తి బల్బు మీద పెట్టింది. నా వేపు కంగారుగా చూసి, నవ్వినట్టనిపించింది. చటుక్కున లైటు ఆర్పేశాను. ఈసారి కోపంగా నా వేపు చూసి, తల విదిలించి, కసితీరా మరో ఫైలు కిందికి తోసేసింది.

రాత్రి వరండాలో ఒదిలేశాను. కానీ త్వరగా నిద్ర పట్ట లేదు. ఓ రాత్రివేళ కిటికీలోంచి చూశాను. వరండాలో మూలగా వుండచుట్టుకుని పడుకుంది.

రెండు రోజుల తరువాత కోతి పిల్ల మకాం మార్చేసింది. నా గదిలోనే పడుకుంటోంది. తాడు కట్టి మంచం కాలికి కట్టేశాను. నేను నిద్రపోయే వరకూ కాపలా. తాడు కట్టించుకోడం దానికి నచ్చలేదు. రోజూ నేను ఇంటి తాళం తియ్యగానే నా కంటే ముందు దూరి



టేబిలు మీంచి దోమతెర పందిరి మీదికి లంఘిస్తుంది. ఊగి ఊగి వచ్చి ఒళ్ళో కూచుంటుంది. దానికాదోమతెర ఉయ్యాల ఇష్టం.

దానికి నేనంటే ఇష్టం. అల్లరి మాత్రం మానలేదు. ఇల్లు అడవి అయిపోతుంది. వారం రోజుల్లో చాలా మార్పులొచ్చేయి. రోజూ నేను జామకాయలూ, టమాటోలు, వేరుశనక్కాయలూ తెచ్చేవాణ్ణి. ఇద్దరం కలిపి తింటాం. తొక్కలతో, పండు ముక్కలతో ఇల్లంతా ఖరాబు. దోమతెర దరిదాపు నాలికలై పోయింది. ఓ రోజు నా పుస్తకాలు రెండు పూర్తిగా చింపేసింది. కేలండర్లా! ఎప్పుడో చింపి పోగులు పెట్టింది. నా ఇల్లు ఇప్పుడు దానిష్టప్రకారం సద్దేను. పుస్తకాలూ, ఫైళ్ళూ లోపల పెట్టి తాళం వేసుకుంటున్నాను. దానికో బంతి కొనిచ్చేను. అది ఎప్పుడు ఎలా ఆడమంటే అలా ఆడ్డనే. ఇల్లు శుభ్రంగా వుండాలనే నియమం లేదు. ఒక ఆదివారం చేంతాడు తెచ్చి చచ్చీ చెడి, అది ఆడుకో డానికై పై దూలానికి కట్టేను. వెర్రి సంతోషం. ఊగీ, ఆడీ, గెంతీ నానా బీభత్సం సృష్టించింది. ఆనందంతో తాడు ఎక్కి దభీమని దోమతెర పందిరి మీదికి దూకింది. అంతే, మిగిలిన పీలికల్ని ఎత్తి వుండచుట్టి బట్టల బుట్టలో పడేశాను. నా దైనందిన జీవితం అంతా దాని చుట్టూరా, దాని కోరిక ప్రకారం మార్చుకున్నాను. దాని మాట వినడనే. ఆ... దానికి "కృష్ణ" అని నామకరణం చేశాను. ఒక రోజు ఉదయం కాఫీ తాగుతున్నాను. అది టమాటో తింటూ కింద ఉమ్ము తోంది. హఠాత్తుగా ఎందుకో దానికి పేరు పెట్టాలని పించింది. అప్రయత్నంగా "కృష్ణే" అని పిలిచేను. తలెత్తి నా వేపు చూసి తల ఊపింది. మళ్ళీ పేరు పెట్టి పిలిచేను. కిచకిచమని టమాటో విసిరి మంచం మీదికి, అక్కణ్ణుంచి నా మీదికి దూకింది. ఒళ్ళంతా కాఫీ మయం. నన్నొదిలి మంచం మీదికి మళ్ళీ. "ఇలారా లంజముండా". వచ్చి టేబిలు మీద కూచుంది. ఇంతకీ దానికా పేరు ఇష్టనే. పిలవగానే వచ్చి భుజం మీద కూచుంటుంది. రోజులో అధిక భాగం అది నా భుజం మీదే వుంటుంది.

ఓ రోజు సాయంకాలం ఆఫీసు నుంచి వస్తూ బేరీ కాయలు తీసుకొచ్చేను. తలుపు తీస్తూనే అలవాటుగా 'కృష్ణే' అని పిలిచేను. ఎంతసేపటికీ రాలేదు. పెరట్లో చూశాను. చీకటి పడిపోతున్నా కృష్ణ జాడ లేదు. వంట చెయ్యలేదు. అది ఎక్కడికీ వెళ్ళదు. పగలల్లా పెరట్లో, ఇక్కడా అక్కడా తిరిగి వచ్చేస్తుంది. టార్చి తీసుకుని రోడ్డు మీదికి పరుగెట్టాను. ఓసారి లారీ కింద పడి కోతి చచ్చిపోయింది. రోడ్డు మీద అటూ, ఇటూ వెతికేను. అడవిలోకి వెళ్ళిపోయిందా? అక్కణ్ణుంచేగా నా దగ్గరికి వచ్చింది. అలవాటు పడ్డాం.

"ఏమిటి వెతుకుతున్నారు?"

ఇంటి వేపొస్తుంటే పక్కింటి సుబ్రహ్మణ్యంగారు.

నీరసంగా తాళం తీసి లోపలికెళ్ళాను. చొక్కా విప్పి ముందు గదిలోకి రాగానే టేబిలు మీద శబ్దమైంది. గోడ నానుకుని బుర్ర గీరుకుంటూ నా వేపే చూస్తూ కిచకిచమంది కృష్ణ.

"ఎక్కడి కెళ్ళేవే దొంగముండా?"

ఉదయం ఆఫీసు కెడుతుంటే ఆపి అడిగేరు సుబ్రహ్మణ్యంగారు.

"మీరు కోతిని పెంచుతున్నారనుకుంటాను. చిన్న ఇంట్లో దూరి నానా గొడవా చేసింది."

"నేనే దాంతో వుంటున్నాను."

తల అడ్డంగా ఊపుతూ దిగాలుగా వెళ్ళిపోయా రాయన.

ఎందుకో ఉదయం నుంచీ మబ్బు పట్టింది. మబ్బులు అడవి బెంగలా వుంటాయి. చిన్న తుంపర. చలిగా వుంది. మధ్యాహ్నం రత్నం వచ్చింది. పనిలో వుండి కూచోమన్నాను. సంతకాలు చేసి కాయితాలు పక్కన పెట్టి ఆమె వేపు చూశాను. సెలవు గురించి మళ్ళీ అడిగింది. వెనక్కి వాలి పరిశీలనగా ఆమె వేపుచూశాను. రత్నం మా ఆఫీసుకొచ్చి మూడేళ్ళు దాటింది. ఆఫీసు కాలెండర్లా, ఆమె కేవలం అలవాటై పోయింది. మొదటిసారి చూసినట్టు చూశాను. ముప్పై అయిదేళ్ళుంటాయి. పెళ్ళి కాలేదు. నల్లగానే వుంటుంది. ముఖం కళగా, ఒళ్ళు ఆరోగ్యంగా వుంటుంది. పైట సర్దుకుంది. నా వేపు మరోసారి చూసింది. తెల్ల చీర, తెల్ల జాకెట్టు. చూపులు వాల్చుకుని పేపరు వెయిట్ తిప్పడం ప్రారంభించాను.

"పి.ఓ. గారితో చెప్పరా సార్."

పెదాలు ఆపేసిన నవ్వు కళ్ళలో కనిపిస్తోంది.

నల్లటి తడి చీకటి. తడిసిన నల్ల శిల్కులా. కృష్ణ తాడు మీద ఎక్కి నానా గొడవా చేస్తోంది. అప్పటికి ఆరుసార్లు నా మీదికి దూకింది. ఏడు దాటుతూండగా ముందు పౌడరు వాసనా, తరువాత రత్నం లోపలి కొచ్చింది. కృష్ణని చూసి నిర్ఘాంతపోయిందామె. ఎదురుగా కూచుందామె. కృష్ణ మెల్లిగా దిగొచ్చింది. కాసేపు ఆమె వేపు చూసి నా ఒళ్ళో కూచుంది.

"కరుస్తదా?"

కృష్ణ కిచకిచమని తాడెక్కి ఉయ్యాల ఊగింది.

తొమ్మిది అవుతూండగా రత్నం ఇంటికెళ్ళి పోయింది.

ఆమె వెళ్ళిపోగానే కృష్ణ భుజం ఎక్కి కూచుంది. మంచం మీంచి లేవబోతూ తల వేపు గోడకున్న అద్దంలోకి చూశాను. చెదిరిన జుట్టూ, బుగ్గ మీద సన్నటి కాటుక రేఖ, భుజం మీద కృష్ణ అద్దంలో నా వేపు కళ్ళార్పకుండా చూస్తోంది. అద్దం కొత్తగా వుంది.

కృష్ణ మాట వినడం మానేసింది. బంతి విసిరి నన్ను తెమ్మంటూంటుంది. మెడకి తాడు కట్టి రోజూ సాయంకాలం ఇంటి వెనక పొలాల్లోకి షికారు వెడుతున్నాను. గట్ల మీంచి ముందు నడుస్తూ నన్ను నడిపిస్తోంది.

ఉంటాను.

నీ

............

పి.ఎస్.

రత్నం సెలవు మంజూరు చేయించాను.